ప్రజాశక్తి
బుధవారం 11 అక్టోబర్ 2023 5 అనంతపురం

అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య, కలెక్టర్ గౌతమి

పౌరహక్కుల కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం

◆ఎన్ఐఎ దాడులు సరికాదు ◆అబ్దుల్ రసూల్, చంద్రశేఖర్‌కు పౌర సంఘాల సంఘీభావం ◆రాజ్యాంగ పరిరక్షణ వేదిక రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

అబ్దుల్ రసూల్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మేధావులు, రచయితలు, జర్నలిస్టులపై కేంద్ర నిఘా సంస్థ జరుపుతున్న దాడులను అనంతపురం జిల్లాలోని పౌర సంఘాల నాయకులు ఖండించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. జిల్లాలో అబ్దుల్ రసూల్, చంద్రశేఖర్‌లపై జరిపిన దాడిని ఖండిస్తూ వారికి అండగా నిలుస్తామని సంఘీభావం తెలిపారు. అనంతపురం నగరంలోని ఎన్జీవో హోంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి, ఎస్‌యుసిఐసి, వైసిపి, టిడిపి, కాంగ్రెస్ పార్టీల నాయకులతోపాటు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. జిల్లాలో అబ్దుల్ రసూల్, చంద్రశేఖర్ నాయకుల ఇళ్లలో ఎన్ఐఎ దాడులు చేయడాన్ని అందరూ సంయుక్తంగా ఖండించారు. ఇద్దరు నాయకులు కూడా ప్రజాస్వామ్యయుతంగా ప్రజల తరుపున నిలబడే నాయకలేనని చెప్పారు. మానవ హక్కుల కోసం నిలబడి నాయకులను లక్ష్యంగా చేసుకుని ఎన్ఐఎ దాడులు చేయడం సహించరానిదని ఖండించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోనున్న బిజెపి ఒక పథకం ప్రకారమే మేధావులు, రచయితలు, ప్రజాస్వామికవాదుల ఇళ్లపై ఇటువంటి దాడులు చేస్తోందని విమర్శించారు. గాంధీ జయంతి రోజున దేశ వ్యాప్తంగా 200కుపైగా ప్రాంతాల్లో సోదాలు నిర్వహించిందన్నారు. ఇది ప్రజాస్వామిక గొంతుకల నొక్కే ప్రయత్నంలో భాగమేనని చెప్పారు. ఇటువంటి వాటికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక వాదులందరూ నినదించాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఖరి నియంత్రుత్వంగా ఉందని చెప్పారు. అబ్దుల్ రసూల్, చంద్రశేఖర్‌లు ఇద్దరూ ప్రజాస్వామిక హక్కుల కోసం మాట్లాడేవారు తప్ప రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉండేవారు కాదని అన్నారు. అటువంటి వారిని కూడా ఈ ప్రభుత్వం ఉపేక్షించే పరిస్థితుల్లో లేకపోవడం శోచనీయమన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి మాట్లాడుతూ దేశంలో ప్రశ్నించే గొంతుకలను నొక్కే ప్రయత్నంలో భాగమే కేంద్రం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ముందు నుంచి పాలకులు ప్రశ్నించే గొంతకలను అణచివేస్తూ వస్తున్నాయన్నారు. గతంలో ఎమర్జెన్సీ పేరుతోనూ ఇటువంటి ప్రయత్నాలే జరిగాయని గుర్తుచేశారు. సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబుళు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ మతోన్మాద విధానాలను బిజెపి అమలు చేస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే వారి విధానాలను ప్రశ్నించే పౌర హక్కులు, ప్రజాస్వామిక వాదుల ఇళ్లపై దాడులు చేసి గొంతులు నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. సమిష్టిగా దీన్ని తిప్పికొట్టాల్సిన అవసరముందన్నారు. ఎస్‌యుఎస్ఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బిజెపి ఈ రకమైన దాడులకు పాల్పడుతూ భయోత్పాతాన్ని ప్రశ్నించే వారిలో సృష్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకులు దాదా గాంధీ మాట్లాడుతూ ప్రజాస్వామిక వాదులపై జరుగుతున్న దాడులను ఖండించారు. దీనికి వ్యతిరేకంగా కాంగ్రెసు పార్టీ నిలబడుతుందని చెప్పారు. వైసిపి నాయకులు ఎకెఎస్ ఫయాజ్ బాషా మాట్లాడుతూ అబ్దుల్ రసూల్, చంద్రశేఖర్‌లపై జరిగిన దాడిని ఖండించారు. వారికి మద్దతుగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నుంచి నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఎన్ఐఎ దాడులను ఖండిస్తూ తీర్మానం చేశారు. అదే విధంగా అబ్దుల్ రసూల్, చంద్రశేఖర్‌లకు సంఘీభావాన్ని తెలుపుతూ తీర్మానం చేశారు.

ప్రజాస్వామికవాదులుగానే ఉంటాం : చంద్రశేఖర్

ప్రశ్నించే గొంతుకలను నొక్కే ప్రయత్నంగానే ఎన్ఐఎ దాడులను చూస్తానని చంద్రశేఖర్ చెప్పారు. తమ ఇంట్లో సోదాలు నిర్వహించి తీసుకెళ్లి పుస్తకాలు చూస్తే ఎవరికైనా నవ్వు వస్తుందన్నారు. వారు పట్టుకెళ్లిన పుస్తకాలేమిటంటే జిల్లాలోని కమ్యూనిస్టు నాయకులైన ఐదుకల్లు సదాశివన్, నీలం రాజశేఖర్ జీవిత చరిత్రలకు సంబంధించిన పుస్తకాలని చెప్పారు. అవి బహిరంగంగా అన్ని చోట్లా లభించే పుస్తకాలేనని చెప్పారు. నిషేధిత పుస్తకాలేవి తమ వద్దలేవని అన్నారు. దశబ్దాలుగా ఇక్కడ ప్రజలతో కలసి అనేక సమస్యలపై పోరాటం సాగించామని తెలిపారు. తామేదేది రాజ్యాంగ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడలేదని, ఇది విషయం జిల్లా వాసులందరికీ తెలిసిందేనని వివరించారు.

సంఘీభావానికి ధన్యవాదాలు

అబ్దుల్ రసూల్

ఎన్ఐఎ అధికారులు తమ ఇంట్లో సోదాలు నిర్వహిస్తే ఏ ఒక్క వస్తువు లభించలేదని అబ్దుల్ రసూల్ తెలిపారు. చివరకు మొబైల్‌ఫోన్ సీజ్ చేసుకుని వెళ్లారని తెలిపారు. ప్రజల తరుపు, వారి సమస్యలపై గళం విప్పడాన్ని ప్రభుత్వం సహించడం లేదని అన్నారు. అయితే ఈ సందర్భంగా జిల్లావాసులు నుంచి పెద్దఎత్తున సంఘీభావం తెలిపినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి

◆ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

◆ఎంపి, దిశ ఛైర్మన్ తలారి రంగయ్య

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో నెలకొన్న సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని అనంతపురం పార్లమెంట్ సభ్యులు, దిశ ఛైర్మన్ తలారి రంగయ్య సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతపురం జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణంలోని డిపిఆర్సి సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం జిల్లా అభివద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాన్ని పార్లమెంట్ సభ్యులు, దిశ ఛైర్మన్ తలారి రంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ ఎం.గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగరపాలక సంస్థ మేయర్ మహమ్మద్ వసీం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రంగయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత చేరువయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల లక్ష్యాలను పూర్తిస్థాయిలో చేరుకునేందుకు అధికారులు కషి చేయాలన్నారు. అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిపై ఎక్కువ ఒత్తిడి పడకుండా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో వసతులను అభివద్ధి చేయాలన్నారు. ఎంపీ లాండ్స్ కింద మంజూరైన పనులను ఎలాంటి పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, పనులు చేపట్టేందుకు అవసరమైన డబ్బులు అందుబాటులో ఉన్నాయనియ తెలిపారు. కలెక్టర్ ఎం.గౌతమి మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాల కింద కేటాయించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు చేరుకోవాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యశ్రీ సిటిజన్ యాప్ డౌన్లోడ్ చేయించాలన్నారు. ఆయా పథకాల కింద కేటాయించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో చేరుకునేందుకు చూడాలని, లేకపోతే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ జిల్లాలో మాతా, శిశు మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్పత్రులలో డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగరపాలక సంస్థ మేయర్ మహమ్మద్ వసీం, సిపిఓ ప్రశాంత్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, హౌసింగ్ పీడీ నరసింహారెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇషాన్ బాషా, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, డిఎంహెచ్ఓ డా॥ఈబి.దేవి పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశాన్ని అడ్డుకుంటాం : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

నగరంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన మున్సిపల్ పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా బుధవారం నాడు జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని తెలిపారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ అనంతపురం నగరంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గత నెల 5వ తేదీన సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించామన్నారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారంపై అధికారులు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పరిష్కారానికి నోచుకోలేదన్నారు. నగరంలో పలు రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ స్థలాలను కాపాడడంలో విఫలమైందన్నారు. చెత్త పన్ను రద్దు చేయాలన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులను పెంచాల్సి ఉందన్నారు. టిడ్కో ఇళ్లను అర్హులైన వారందరికీ వెంటనే ఇవ్వాలన్నారు. పెండింగ్ లో ఉన్న నడిమి వంక రక్షణ గోడలను నిర్మించి, నడిమి వంక, పెద్ద వంక, మరువ వంక పూడికతీత పనులను చేపట్టాలన్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని చెప్పి అధికారులు పట్టించుకోలేదన్నారు. దీనిని నిరసిస్తూ నేడు జరిగే కార్పొరేషన్ సమావేశాన్ని ముట్టడిస్తామని చెప్పారు.

నేడు కార్పొరేషన్ సాధారణ సర్వసభ్య సమావేశం

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం స్థానిక కౌన్సిల్ హాలులో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి సంఘం శ్రీనివాసులు తెలిపారు. మేయర్ మహ్మద్ వసీం అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో కార్పొరేటర్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

స్టిక్కర్ల అతికింపును అడ్డుకుంటున్న సిపిఎం నాయకులు

వ్యవసాయ మీటర్లకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు వద్దే వద్దు...!

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని ఓబుళాపురం గ్రామంలో వ్యవసాయ విద్యుత్ డీపీలు, మోటార్లకు స్కాన్ క్యూర్ కోడ్ స్టిక్కర్లను అతికించడానికి వచ్చిన విద్యుత్ అధికారులను రైతు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వ్య.కా.సం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కృష్ణమూర్తి, ఎస్.సూరి, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటచౌదరి మాట్లాడుతూ ఇప్పటికే రైతాంగం పూర్తిగా నష్టపోయిందన్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. చాలామంది రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితిలో ఉన్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం బిజెపి విధానాలను అమలు పరచడంలో భాగంగా రైతు మోటార్లకు మీటర్లు పెట్టే కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అతి ఉత్సాహంతో అమలు చేస్తూ రైతుల విద్యుత్ డీపీలు, మోటార్లకు స్కానర్లను సర్వే రూపంలో స్టిక్కర్లు అతికించడం మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పెద్దయ్య, భాస్కర్, నాయకులు చిన్న నాగన్న, నాగేశ్వర్, గోపాల్, రామాంజనేయులు, రామ్మోహన్, రైతులు పాల్గొన్నారు.

ఎఇ రామాంజనేయులు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఐఅండ్ పీఆర్ శాఖలో ఎఇగా జిల్లాలో పని చేస్తూ శ్రీ సత్యసాయి జిల్లాకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పదోన్నతిపై వెళ్తున్న రామాంజనేయులు సేవలు వెలకట్టలేనివని ఐ అండ్ పీఆర్ డిఐపిఆర్ఓ గురుస్వామిశెట్టి కొనియాడారు. మంగళవారం సాయంత్రం అనంతపురం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఏఈగా పని చేస్తూ శ్రీ సత్యసాయి జిల్లాకు ఏఈఈగా పదోన్నతిపై వెళుతున్న రామాంజనేయులుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐపిఆర్ఓ మాట్లాడుతూ 25 ఏళ్లుగా సమాచార పౌర సంబంధాల శాఖలో వివిధ స్థాయిలలో పనిచేసి ప్రస్తుతం ఏఈఈగా పదోన్నతి పొందిన రామాంజనేయులు ఎంతో కష్టపడి పని చేసే వ్యక్తి అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆయనతో ఉన్న అనుబంధం గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు శివ రామాంజనేయులు, సమాచార శాఖ అధికారి వి.సూర్యనారాయణరెడ్డి, పిఆర్ఓ సూర్యనారాయణరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ప్రభావతి, జూనియర్ అసిస్టెంట్ చాంద్‌బాషా, టైపిస్టులు దుర్గా సుహాసిని, దామోదర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎఇ రామాంజనేయులును సన్మానిస్తున్న ఐ అండ్ పీఆర్ సిబ్బంది

కాలపరిమితి నిర్ణయంతో విఒఎలకు నష్టం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

యానిమేటర్లు(విఒఎ)ల ఉపాధిని దెబ్బతీసేలా విధించిన మూడు సంవత్సరాల కాలపరిమితిని వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. విఒఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. విఒఎ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మద్దతుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ గ్రామాల్లో విఒఎలు ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఇంత కష్టపడి పని చేస్తున్నా వారికి పనికి భద్రత లేదన్నారు. ప్రభుత్వం స్పందించి వారికి భద్రత కల్పించాలన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య మాట్లాడుతూ గ్రామ సమాఖ్యల అనుసంధానం నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. విఒఎలను అనుసంధానం చేయడం ద్వారా వేలాది మంది విఒఎలు ఉపాధికి దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ విఒఎల ఉపాధికి నష్టం చేకూర్చే మెర్జ్ నిర్ణయాన్ని ఆపాలన్నారు. ఎక్కువ సంఘాలున్న విఒఎల నుంచి తక్కువ సంఘాలున్న విఒఎలకు సర్దుబాటు చేయాలన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండకూడదన్నారు. 15 సంఘాల్లోపు ఉన్న విఒఎలకు వేతనాలు చెల్లించలేదన్నారు. విఒఎలుగా ఉపాధి కోల్పోయిన వారందరికీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి మాట్లాడుతూ విఒఎలకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలన్నారు. అనంతరం డిఆర్ఓ గాయత్రిదేవిని కలిసి వినతి పత్రం అందజేశారు.

'శ్రీరామిరెడ్డి' కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విచారణ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, కార్మికులు

కార్మికులను మోసం చేస్తున్న నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ చేస్తున్న అక్రమాలపై ప్రభుత్వం నియమించిన విచారణ కమిటీకి సిఐటియు నాయకులు, కార్మికులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మడకశిర డివిజన్‌లో బోగస్ కార్మికులను పెట్టుకుని డబ్బులు దోసుకుంటున్న కాంట్రాక్టర్ ఎల్.కె.నాయుడు అసలైన కార్మికులకు వేతనంలో రూ.2,500 కోత విధిస్తున్నారన్నారు. దీన్ని నిలదీసిన యూనియన్ నాయకుడు సుబ్బరాజును పనిలోకి రావద్దనడం దుర్మార్గమన్నారు. అలాగే హిందూపురం డివిజన్ కార్మికులకు కాంట్రాక్టర్ గోవర్ధన్‌రెడ్డి 18 నెలల ఈపీఎఫ్ కట్టాలని తెలిపారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సత్యసాయి జిల్లా శ్రీరామిరెడ్డి వాటర్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు లక్ష్మీనారాయణ, అనంతపురం జిల్లా నాయకుడు ప్రభాకర్, మడకశిర డివిజన్ అధ్యక్షులు సుబ్బారాజు, హిందూపూరు కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలి

వామపక్షాల ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప

ప్రజలపై భారాలు మోపుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోకపోతే ఐక్యంగా పోరాడుదామని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యుత్ సంస్కరణలు, భారాలపై వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారం మంగళవారం రెండవ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా బళ్లారి బైపాస్ నుంచి తపోవనం సర్కిల్ వరకూ విద్యుత్ బారాలను తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ప్రభుత్వాలు విద్యుత్ ఛార్జీలు పెంపుదల చేసి భారాలు మోపడం దుర్మార్గంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఒక మాట అధికారంలోకి వచ్చాక మరొక మాటగా మార్చి దగా చేస్తున్నారని పాలకులను విమర్శించారు. సిఎం జగన్ చెప్పింది ఒకటి.. అమలు చేస్తోంది మరకటిగా ఉందన్నారు. ఎప్పుడో వినియోగించిన విద్యుత్‌కు సెస్ అంటూ, ట్రూప్ ఆఫ్ ఛార్జీలంటూ విద్యుత్ భారాల మోత మోగిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్‌లు బిగించి వినియోగదారులను దోపిడి చేసే కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. విద్యుత్ చార్జీలను తగ్గించాల్సింది పోయి పెంపుదల చేయడం ప్రజలను మరింత ఇబ్బందుల్లో నెట్టివేయడమే అవుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీల ఉచిత విద్యుత్ పథకం కూడా పూర్తి స్థాయిలో అమలు కాని దుస్థితి నెలకొందన్నారు. ఇప్పుడ ఆ పథకానికి కూడా తూట్లు పొడిచేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని తెలిపారు. ఒక్క విద్యుత్ భారాలే కాకుండా వివిధ రంగాల్లో కూడా ప్రజలు భారాలు మోసే దయనీయ పరిస్థితి రాష్ట్రంలో ఏర్పడిందన్నారు. ప్రభుత్వాల అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టేందుకు ప్రజలు పోరాటాల్లో భాగస్వాములు కావాలన్నారు. వామపక్షాలుగా నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని ప్రజల మద్దతు కలిసివస్తే ప్రభుత్వాలు దిగిరాక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు వై.వెంకటనారాయణ, నగర కమిటీ నాయకులు వలి, రాజు, బాబా, వెంకటేష్, లక్ష్మీనారాయణ, ఎన్టీఆర్ శీనా, గపూర్, ఎర్రిస్వామి, ఆవాజ్ నాయకులు ఇస్మాయిల్, శర్మాస్, సిపిఐ నగర కార్యదర్శి శ్రీరాములు, నగర నాయకులు రమణయ్య, అల్లీపీరా సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు నాగరాజు, వీరనారప్ప తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ వాహనాలకు పార్కింగ్ స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, అంబులెన్స్‌ల ఓనర్లు, డ్రైవర్లు

ప్రయివేట్ అంబులెన్స్ వాహనాలకు నగరంలో పార్కింగ్ స్థలం కేటాయించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం అంబులెన్స్ ఓనర్‌లు, డ్రైవర్‌లు సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సంగమేష్ సర్కిల్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిఆర్ఓ గాయత్రి దేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజనాసుపత్రి రోగుల సౌకర్యార్థం అంబులెన్స్‌లు ఆసుపత్రి ప్రహరీ వద్దనే పార్కింగ్ చేసుకునే వారని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో ఆసుపత్రి పరిసరాల్లో అంబులెన్స్ పార్కింగ్ చేయరాదని అధికారులు ఆదేశించారని తెలిపారు. దీంతో అంబులెన్స్ వాహనాలు అంబేద్కర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పార్కింగ్ చేసుకుంటున్నారని తెలిపారు. అయితే బాడుగలు రాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం అధికారులు స్పదించి యధావిధిగా ప్రభుత్వ సర్వజనాసుపత్రి వద్దనే పార్కింగ్ స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఓ గాయత్రిదేవిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన డిఆర్ఓ ఆసుపత్రి సూపరిన్‌టెన్‌డెంట్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు లతీఫ్, ఇర్ఫాన్, ఆటో యూనియన్ నాయకులు ఆజాం, ఆదినారాయణ, అంబులెన్స్ ఓనర్స్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు జిలాన్, రమేష్, రాము, గోపాల్, అశోక్, శివ, రజాక్, వలి, సంతోష్, గోవిందరాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యం

ప్రజాశక్తి-శింగనమల

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సిఎం జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారని రాష్ట్ర నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల తెలిపారు. మంగళవారం మండలంలోని సి.బండమీదపల్లి సచివాలయంలో సర్పంచి సరోజమ్మ, ఎంపిటిసి రేణుకమ్మ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.1.62 కోట్ల కుటుంబాలు ఆరోగ్యవంతంగా ఉండాలన్న ధ్యేయంతో 45 రోజులపాటు 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మలాకుమారి, తహశీల్దార్ ఈశ్వరమ్మ, జెసిఎస్ మండల కన్వీనర్ వెంకటరమణ, సచివాలయ కన్వీనర్ నరసింహారెడ్డి, వైసిపి మహిళా మండల కన్వీనర్ రమాదేవి, బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి లలిత కళ్యాణి, బిసి సెల్ మండల ప్రధాన కార్యదర్శి సాకే లోకనాథ్, నాయకులు రామకృష్ణారెడ్డి, నాగన్న, ఆదినారాయణరెడ్డి, ముసలన్న, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండల అధ్యక్షులు రామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు కళ్యాణ్‌కుమార్, ఉషారాణి ప్రజలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామకృష్ణ, తహశీల్దార్ లక్ష్మీకాంత్‌నాయక్, వైసిపి మండల కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని సిద్ధిరాచర్ల గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికిపైగా ప్రజలకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దివాకర్, తహశీల్దార్ హరికుమార్, ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహా, సర్పంచి రామాంజనేయులు, వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, రవిశంకర్, మహేంద్ర, అమర్‌మహేష్, ప్రసాద్, అనన్య, ఎంపిహెచ్‌ఓ మల్లికార్జున, ఎంపిహెచ్‌ఎస్ శ్రీరాములు, సూపర్‌వైజర్ అకులప్ప, సిహెచ్‌ఓ బాలాజీ, ఏఎన్ఎంలు వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓ, అంగన్వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'లో నాయకులు

మెడికల్ కిట్లను పంపిణీ చేస్తున్న

పుట్లూరు : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా క్షేత్రస్థాయిల గ్రామీణ ప్రాంతవాసులకు మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నట్లు ఎంపిడిఒ ఎంపిడిఒ యోగానందరెడ్డి, తహశీల్దార్ మోహన్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కడవకల్లు సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో 245మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో అదనపు చికిత్స అవసరమైన వారిని వివిధ ఆసుపత్రికి సిఫారసు చేసినట్లు వైద్యురాలు హిమబిందు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్లు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని వేపరాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 292 మందికి వివిధ రకాలైన వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షురాలు కాపు భారతి, ఎంపిడిఒ కొండయ్య, పంచాయతీ విస్తరణ అధికారి రంగనాయకులు, వైద్యాధికారులు, సచివాలయం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను తెలుసుకుంటున్న జనసేన నాయకులు

భద్రంపల్లి దళితవాడలో

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలంలోని భద్రంపల్లి దళితవాడలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం భద్రంపల్లిలో జనసేన నాయకులు పర్యటించి తాగునీటి సమస్యను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ భద్రంపల్లి ఎస్సీ కాలనీలో మూడు నెలలుగా తీవ్ర నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. కేవలం ఓట్ల కోసం వచ్చే నాయకులు సమస్యలు పరిష్కరించేందుకు రాకపోవడం బాధాకరమన్నారు. అలాగే ఎస్సీ కాలనీకి ఉన్న శ్మశాన వాటిక కబ్జాకు గురైందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి భద్రంపల్లిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధికార ప్రతినిధి మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి చొప్ప చంద్రశేఖర్, జిల్లా సంయుక్త కార్యదర్శి విజయలక్ష్మి, పురుషోత్తంరెడ్డి, కృష్ణమూర్తి, జిల్లా కార్యక్రమాల నిర్వహణ కమిటీ సంతోష్‌యాదవ్, మండల అధ్యక్షులు జి.ఎర్రిస్వామి, వీర మహిళలు సరిత, అనసూయ, నాయకులు అరటి తాహిర్, సద్దాంఖాన్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి : మండలంలోని మార్నేంపల్లి మలుపు వద్ద 67వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన రఘునాథ్ ట్రాన్స్ కో ఎఇగా, నబిరసూల్ లైన్‌మెన్‌గా గుంతకల్లులో విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ పని ముగించుకుని గుత్తికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. మార్నేంపల్లి గ్రామ మలుపు వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వారిరువురిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం వారిని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు

విద్యుదాఘాతంతో డ్రైవర్‌కు గాయాలు

గుత్తి : మండలంలోని ఊటకల్లు గ్రామంలో మంగళవారం విద్యుగాఘాతంతో ఓ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన ఎద్దుల శివ వాటర్ ట్యాంకర్ డ్రైవర్ పని చేస్తున్నాడు. ఇందులో భాగంగా ట్యాంకును నింపుతుండగా ఎంతవరకూ నీరు చేరిందో చూడడానికి ట్యాంకర్ పైకి ఎక్కాడు. అయితే పైన విద్యుత్ తీగలు ఉండడంతో షాక్ గురై తీవ్రగాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు. అదనపు చికిత్స కోసం అతన్ని కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు.

అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు గ్రానైట్ వితరణ

గుత్తి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు గుత్తికి చెందిన ఎం.రామాంజనేయులు గ్రానైట్ బండలను వితరణ చేశారు. గుంతకల్లు మండలం కసాపురం బస్టాండ్ వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా గ్రానైట్ బండల వ్యాపారి ఎం. రామాంజనేయులు 41/2 చదరాల గ్రానైట్‌ను విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ గుంతకల్లు నియోజవర్గ అధ్యక్షులు విజయ్, కసాపురం స్వామిదాసు, ఆంజనేయులు ధర్మాపురం బందం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

రాయదుర్గం : పట్టణంలో నెలకొన్న విద్యుత్ ఓల్టేజీ హెచ్చుతగ్గులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, సరఫరాలో అంతరాయం సమస్యలతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు అధ్యక్షులు పోరాలు శిల్ప కోరారు. ఈమేరకు మంగళవారం అనంతపురంలోని జిల్లా పరిషత్ హాలులో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ సమీక్ష సమావేశంలో కలెక్టర్ గౌతమిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యల పరిష్కారానికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

వైఎస్ఆర్ 'పట్టు'బడిపై అవగాహన

బ్రహ్మసముద్రం : మండలం పరిధిలోని వేపులపర్తి రైతు భరోసా కేంద్రంలో పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద మంగళవారం వైఎస్ఆర్ పట్టుబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సెరికల్చర్ ఆఫీసర్ నవీన్‌కుమార్ పట్టుపరిశ్రమ శాఖ ద్వారా అమలవుతోన్న వివిధ పథకాలు, రాయితీల గురించి వివరించారు. కళ్యాణదుర్గం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ ఉషావర్ధని మల్బరీలో నూతన యాజమాన్య పద్ధతులు, పంట దిగుబడి, మల్బరీ ద్వారా స్థిరమైన ఆదాయం పొందే మార్గాల గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని సరిత, టెక్నికల్ అసిస్టెంట్ గంగులప్ప, అక్బర్, విహెచ్ఎ ముజావీర్‌బాషా, విఎస్ఎ నాగేంద్ర, ఆర్‌బికె ఛైర్మన్ తిప్పారెడ్డి పాల్గొన్నారు.

ఫైళ్లను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలి : ఎస్పీ

అనంతపురం క్రైం : జిల్లా పోలీసు పరిపాలనా విభాగంలో ఫైళ్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సిబ్బందికి సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరిపాలనా విభాగాలను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా డీపీఓలోని ఎ సెక్షన్, బి సెక్షన్, పే సెక్షన్‌తో పాటు డీటీఆర్బీ, డీసీఆర్బీలలోని అన్నివిభాగాలను పరిశీలించారు. పకడ్బందీగా రికార్డులను మెయింటైన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి శంకర్, సీఐలు విశ్వనాథచౌదరి, వలీబాషా, ఎస్పీ సీసీ ఆంజనేయ ప్రసాద్, ఐటీ కోర్ టీం సభ్యుడు మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

13న పివికెకెలో ప్రాంగణ నియామకాలు

అనంతపురం : స్థానిక రుద్రంపేటలోని పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 13న ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ హెక్సావేర్ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంగణ నియామకాలకు 2020-23 మధ్య ఏదైనా డిగ్రీ, బీటెక్ పాసైన విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

50 హాకీ స్టిక్కులు అందజేత

నార్పల : నార్పల హాకీ క్లబ్‌కు ఆర్‌డిటి సంస్థ తరపున 50 స్టిక్కులను ప్రదానం చేశారు. ఈమేరకు నార్పల బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యురాలు సంగీతకుమారితో అందించినట్లు హాకీ శిక్షకుడు వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు శివమ్మ, నార్పల హాకీ క్లబ్ ఇన్‌ఛార్జి వెంకటరామిరెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జూడో, బాస్కెట్ బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అనంతపురం : జూడో, బాస్కెట్ బాల్ పోటీల్లో కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సాయినాథ్ 80 కిలోల విభాగంలో మొదటి బహుమతి సాధించాడు. అలాగే అండర్-17 విభాగంలో 9వ తరగతికి చెందిన రిషిత్, అనిరుద్ ద్వితీయ స్థానంలో నిలిచారు. అండర్-14 విభాగంలో 8వ తరగతి విద్యార్థి సాదిక్ 50 కిలోల విభాగంలో మొదటి బహుమతి సాధించాడు. అలాగే బాస్కెట్‌బాల్ పోటీలో 8వ తరగతికి చెందిన సయ్యద్‌తౌఫిక్ మొదటి స్థానంలో నిలిచారు. ఈమేరకు ఆయా విద్యార్థులను ఎజిఎం సుబ్బారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్, మహేష్, ఎఒ గోపాల్, పిఇటి కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు

టపాసుల నిల్వలపై దాడులు

అనంతపురం క్రైం : నగరంలోని తిలక్ రోడ్డులో అక్రమంగా టపాసులు నిల్వ ఉంచిన దుకాణాలపై మంగళవారం దాడి చేసి పెద్దమొత్తంలో టపాసులను సీజ్ చేసినట్లు డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక పాతూరు తిలక్ రోడ్డులో ఉన్న పవన్ ట్రేడర్స్‌కు చెందిన గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులను స్వాధీనం చేసుకుని యజమాని నంద బాలకృష్ణపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై సమావేశం

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని పంచాయతీల అబివృద్ధిపై ఎంపిడిఒ యోగానందరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ యోగానందరెడ్డి పంచాయతీలను ఎలా అభివృద్ధి చేసుకోవాలనే అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి ఆనందప్రసాద్, హౌసింగ్ ఎఇ లోకేష్‌కుమార్, ఎస్‌ఒ విజయ్‌కుమార్, ఎంఇఒ ప్రేమ్‌కుమార్, ఎపిఒలు చెన్నకేశవులు, భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ జీతాలు చెల్లించాలి : ఎస్‌టియు

ఆత్మకూరు : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సెప్టెంబర్ నెల వేతనాలతోపాటు పింఛన్లను చెల్లించాలని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రమణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని సనప జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ నెల 10వ తేదీ వచ్చినా ఇంత వరకూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు వేతనాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. వేతనాలు చెల్లించకపోవడంతో ఉద్యోగులు, పెన్షనర్లు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలతోపాటు పెన్షన్ సొమ్ములను ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శులపై చర్యలు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలంలోని మేడిమాకులపల్లి గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శి చిన్న శివయ్య, గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శి భ్రమరాంబను కలెక్టర్ గౌతమి సస్పెండ్ చేసినట్లు ఎంపిడిఒ కుళ్లాయిస్వామి తెలిపారు. గతనెల 8న ఎంపి తలారి రంగయ్య సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయగా వీరిద్దరూ విధులకు రాకుండా గైర్హాజరు అయ్యారు. దీంతో విధి నిర్వహణలో అలసత్వం వహించినందున ఎంపీ తన నివేదికలో కలెక్టర్ కార్యాలయానికి పంపగా స్పందించిన కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

కాలవ శ్రీనివాసులు అరెస్టు దుర్మార్గం

ప్రజాశక్తి-శింగనమల

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులును అనంతపురంలో హౌస్ అరెస్టు చేయడం దుర్మార్గమని నియోజకవర్గ టిడిపి నాయకులు ఖండించారు. ఈమేరకు మంగళవారం అనంతపురంలోని కాలవ శ్రీనివాసులు ఇంటికి చేరుకుని పరామర్శించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్.రాజు, జిల్లా అధికార ప్రతినిధులు డేగల కృష్ణమూర్తి, పర్వతనేని శ్రీధర్‌బాబు మాట్లాడుతూ నాయకులను నియోజకవర్గాలకు వెళ్లకుండా అడ్డుకోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా రాయదుర్గం నియోజకవర్గంలో టిడిపి కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇలాగే కొనసాగితే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మాసూల చంద్రమోహన్, టిఎన్‌టియుసి రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాళ్ల నాగేంద్ర, నియోజకవర్గ తెలుగు అధ్యక్షుడు అధ్యక్షుడు నరేంద్రకుమార్‌యాదవ్, జిల్లా బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి కొయ్యగూర పెద్దన్న, మాజీ ఎంపిటిసి చిక్కాల చంద్రాయుడు, నియోజవర్గ కార్యదర్శి నారాయణస్వామి, నాగుల గుడ్డం శివ, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ మొండిపోగుల ఎర్రిస్వామి, రాచేపల్లి రవీంద్ర నాథ్‌రెడ్డి, మట్లగుంది పుల్లయ్య, రమేష్ పాల్గొన్నారు.

నారా భువనేశ్వరిని కలిసిన బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

నారా భువనేశ్వరితో బండారు శ్రావణిశ్రీ, సీనియర్ నాయకురాలు లీలావతి

చంద్రబాబు అక్రమ అరెస్టు రిమాండ్ నేపథ్యంలో శింగనమల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ, సీనియర్ నాయకురాలు బండారు లీలావతి, తదితరులు మంగళవారం రాజమహేంద్రవరంలో నారా భువనేశ్వరిని, బ్రాహ్మణిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు అన్యాయమన్నారు. ప్రభుత్వం కక్షసాధింపు చర్యతోనే టిడిపి అధినేతను జైలుకు పంపిందని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. వీరితోపాటు టిడిపి సీనియర్ నేత నిమ్మకాయల చినరాజప్ప, టీ.డీ జనార్ధన్, ఆదిరెడ్డి శ్రీనివాస్, వంగలపూడి అనిత, పొగాకు జైరామ్‌చందర్, తదితరులను కలిశారు.

కానిస్టేబుల్ కిడ్నీ మార్పిడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

అనంతపురం డీటీసీలో పని చేస్తున్న కానిస్టేబుల్ ఎన్.రవికుమార్ (పీసీ నెంబర్ 3144)కు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స కోసం సహచర బ్యాచ్ మేట్లు ఆర్థికసాయం అందించారు. ఈమేరకు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌తో బ్యాచ్ మేట్లతోపాటు డీసీఆర్బీ, రాయదుర్గం రూరల్, కళ్యాణదుర్గం, కళ్యాణదుర్గం రూరల్ సీఐలు విశ్వనాథ్ చౌదరి, యుగంధర్, తేజోమూర్తి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమీకరించిన మొత్తం రూ.2.13 లక్షల నగదును మంగళవారం అందజేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఇప్పటికే ఆర్డీటీ వారు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స కోసం రూ.6 లక్షలు అందజేశారు. మానవత్వంతో రూ.6 లక్షలు అందించిన ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్‌కి ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థికసాయం అందించిన సహచర బ్యాచిమేట్లను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్ విజయభాస్కర్‌రెడ్డి, డీసీఆర్బీ సీఐ విశ్వనాథ్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, సహచర కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరచిన సిబ్బందికి అభినందన

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

సిబ్బందిని అభినందిస్తున్న కమాండెంట్ గంగాధర్‌రావు

14వ బెటాలియన్ హెడ్‌క్వార్టర్‌లో నిర్వహించిన బి కంపెనీ ఎఆర్‌సి కోర్సులో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని కమాండెంట్ గంగాధర్‌రావు అభినందించారు. మంగళవారం స్థానిక14వ బెటాలియన్ హెడ్‌క్వార్టర్‌లో బి కంపెనీ ఎఆర్‌సి కోర్సు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండోర్, అవుట్‌డోర్ లో ప్రతిభ కనబరచిన సిబ్బందికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమాండెంట్ డి.వి.రమణమూర్తి, ట్రైనింగ్ ఇన్‌ఛార్జి డీఎస్పీ రమణమూర్తి, ఆర్.ఐ.లు రాము, నాగేంద్ర, లోకేశ్వరనాయుడు, రామారావు, ట్రైనింగ్ ఆర్ఎస్ఐ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

NAME CHANGE

Achitha vedavathi wife of N.Ramanjaneyulu D.no.10-1-40/1, of lakshmi bazar, Rayadurg-515865 of Ananthapur District AP. I have changed my name Achitha vedavathi (old name) new name to Nagella Vedavathi (new name) vide affidavit dated 10-10-2023 sworn before notary by S Channaveerappa, Notary & Advocate, Rayadurg.

ప్రతి పథకం ఓ విప్లవం : ఎమ్మెల్యే పద్మావతి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

నవరత్నాల్లో భాగంగా సిఎం జగన్ అమలు చేస్తున్న ప్రతి పథకం ఓ విప్లవమే అని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం మండలంలోని కొర్రపాడు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం పథకాలను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో గ్రామాల్లోని అన్ని వర్గాలకూ మంచి జరిగుతోందన్నారు. మంచి జరిగితేనే రానున్న ఎన్నికల్లో జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు. దమ్మున్న ముఖ్యమంత్రి జగన్ మాత్రమేనని కొనియాడారు. ప్రజలకు అన్ని రకాలుగా మంచి చేస్తున్న జగనన్న ప్రభుత్వానికి మరోసారి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ తేజోష్ణ, జడ్పిటిసి భాస్కర్, హౌసింగ్ ఇంజినీర్ రాజశేఖర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి శ్యామసుందర్‌రెడ్డి, ఎపిఎం మద్దిలేటి, బుక్కరాయసముద్రం సర్పంచి పార్వతి, జెసిఎస్ కన్వీనర్ భయపరెడ్డి, రేకులకుంట లక్ష్మీనారాయణ, పూల నారాయణస్వామి, ఆగ్రోస్ రామకృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వరికూటి కాటమయ్య, సత్తి, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పనులను పూర్తి చేస్తాం : మాజీ ఎమ్మెల్యే విశ్వ

ప్రజాశక్తి-ఉరవకొండ

నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు తాగునీటి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చేస్తామని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. ఉరవకొండ పట్టణ, నియోజకవర్గంలో పలుగ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలపై రాష్ట్ర ఆర్డబ్ల్యుఎస్ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఇఎన్‌సి) కృష్ణారెడ్డిని విజయవాడలో కలిసి చర్చించారు. ఇందుకు సంబంధించిన వివరాలను మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఫోన్‌లో మీడియాకు వెల్లడించారు. దాదాపు మూడేళ్ల క్రితమే మంజూరైన తాగునీటి ప్రాజెక్టులు కొన్ని సాంకేతిక సమస్యల వల్ల ఆగిపోయిన విషయాన్ని ఈఎన్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో ప్రధానంగా కూడేరు మండలం ఉదిరిపికొండ నుంచి ఉరవకొండకు పైపులైన్ నిర్మాణం, ఉరవకొండ మండలం నింబగల్లు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి అదనపు పైపులైన్, విడపనకల్లు మండలం హవలిగి, పాల్తూరు, కరకముక్కల తదితర ఏడు గ్రామాల నీటి ఎద్దడి తీర్చేందుకు బల్లనగుడ్డం నుంచి విడపనకల్లు మండలం హవలిగి గ్రామానికి నూతన పైపులైన్ నిర్మాణం పనులు తక్షణమే పనులు ప్రారంభించాలని కోరారు. ఆయా పనులు పూర్తయితే ఉరవకొండతోపాటు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య పూర్తిగా తొలగిపోతుందన్నారు. కావున వెంటనే పనులు ప్రారంభించాలని ఆ సమావేశంలో కోరినట్లు విశ్వేశ్వరరెడ్డి చెప్పారు. ఇందుకు స్పందించిన కృష్ణారెడ్డి వీలైనంత త్వరగా పనులు ప్రారంభి పూర్తిస్తామని చెప్పినట్లు తెలిపారు.

వ్యవసాయానికి 9గంటలు విద్యుత్ సరఫరా చేయాలి

టిడిపి మండల కన్వీనర్ బిడి చిన్నమారయ్య

ప్రజాశక్తి-ఉరవకొండ

విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు

వ్యవసాయ మోటార్లకు 9 గంటలపాటు అంతరాయం లేని, నాణ్యమైన విద్యుత్తును అందించాలని విడపనకల్ టిడిపి మండల కన్వీనర్ బీడీ చిన్నమారయ్య డిమాండ్ చేశారు. మంగళవారం విడపనకల్ మండల పరిధిలోని మాలాపురం గ్రామంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌తోపాటు మండల కేంద్రంలోని తాగునీరు సరఫరా చేసే కార్యాలయం వద్ద టిడిపి ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు పగటిపూట నిరంతరాయంగా తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశామని గుర్తు చేశారు. రైతుల బాధలను అర్థం చేసుకుని కోతలు లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విడపనకల్ మండలం వ్యాప్తంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. అన్ని గ్రామాలకు సరిపడా తాగునీరు అందించాలని ఏఈని కోరారు. సత్యసాయి గ్రామీణ తాగునీటి చెరువులో నీరు తగ్గడంతో మరికొన్ని రోజుల్లో గ్రామాలకు నీటి కష్టాలు వస్తాయన్నారు. కావున ముందుగానే అప్రమత్తమై సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బీడీ.చిన్నమారయ్య, టిడిపి పార్లమెంట్ జిల్లా కార్యదర్శి హనుమంతు, తెలుగు యువత జిల్లా కార్యదర్శి ఉండబండ వన్నూరుస్వామి, సర్పంచులు చంద్రశేఖర్, తిప్పారెడ్డి, అశోక్, భీమలింగాచౌదరి, సీతారాం, ధనుంజయ, కొత్తకోట బాషా, హవళిగి తిప్పయ్య, మంజునాథ్, వన్నూరుసాబ్, ఉప్పర నాగరాజు, సినిమా రాంజనేయులు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎపి స్కూల్ గేమ్స్‌లో మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక సంఘమేశ్ నగర్‌లోని మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు ఎపి స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. చెస్ అండర్ సెవెంటీన్ విభాగంలో 9వ తరగతి చదువుతున్న శ్రీవిజ్ఞ, కమల్ ఆర్చరీలో, పదో తరగతి విద్యార్థి అసిఫ్, బాస్కెట్‌బాల్‌లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కరస్పాండెంట్ సి.సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో చురుగ్గా ఉంటే చదువుల్లోనూ ప్రతిభ కనబర్చుతారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపల్ కె.పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

అందుబాటులో ఇంటర్ మార్కుల మెమోలు

ఉరవకొండ : 2022-23 విద్యా సంవత్సరం మార్చి, మేనెలలో జరిగిన పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఒరిజినల్ మార్కుల జాబితాలు ఇంటర్ బోర్డు నుండి కళాశాలకు అందినట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మమత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వారి మార్కుల జాబితాలను కళాశాల కార్యాలయంలో సంప్రదించి పొందవచ్చన్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జగన్ రెడ్డి ఆనందం కోసం సిఐడి అధికారులు అతి చొరవ తీసుకుని కేసులు నమోదు చేస్తున్నారని, అక్రమ కేసులకు భయపడేది లేదని ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి అన్నారు. మంగళవారం అనంతపురం అర్బన్ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఓటమి భయంతోనే సిఎం జగన్ వ్యవస్థల్ని అడ్డుపెట్టుకుని చంద్రబాబుపై అక్రమ కేసులతో రాజకీయ కక్ష సాధిస్తున్నారన్నారన్నారు. , స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్ గ్రిడ్ అంటూ ఒక దాని తర్వాత ఒకటి కేసులు బనయిస్తున్నారని, టిడిపి హయాంలో ఆరు లక్షల కోట్ల అవినీతి జరిగిందంటూ వైసీపీ నేతలంతా నోరు నెత్తి బాదుకుంటున్నారని అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయిన 60 రూపాయల అవినీతి కూడా నిరూపించలేకపోయారని, రాష్ట్రంలో యువతకు నైపుణ్యాభివద్ధి శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటు చేశామన్నారు. కానీ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ కక్షతోనే దాన్ని నిర్వీర్యం చేసి, యువతకు ఉపాధి లేకుండా చేశారని తెలిపారు. ఈ కేసు రిమాండ్ రిపోర్టు పేజీ నెంబర్ 16లో, ఒక పేరాలో రూ.145.37 కోట్లని మరో పేరాలో రూ.279 కోట్లని, పేజీ నెంబర్ 21 లో అసలు ఈ సొమ్మంతా ఎటుపోయిందో ఎవరి ఖాతాలోకి వెళ్లిందో తెలియదని సిఐడి చెప్పిందన్నారు. డబ్బు ఎంతో తెలియకుండా ఎవరి ఖాతాలోకి వెళ్లిందో తేలకుండా చంద్రబాబు తప్పు చేశారని ఎలా అంటారని ప్రశ్నించారు. ఎలాంటి అవినీతి జరగకుండా కేవలం రాజకీయ కక్ష దురాలోచనతోనే అక్రమ కేసులు మోపుతున్నారని, వ్యవస్థల్ని మ్యానేజ్ చేసి బెయిలు రాకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. వైసిపి పాలనలో నేరస్తులు బయట తిరుగుతున్నారని నిరపరాదులు చెరసాలలో ఉంటున్నారని తెలిపారు. అరాచక పాలనకు కాలం చెల్లిందన్నారు. కేసులు పెట్టిన భయపడేది లేదని ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామన్నారు.